క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



గాయత్రినగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుతో బాటసారులకు దాహార్తి తీరుతుందని యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేపీ విశాల్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రినగర్‌లో అగాపే ప్రేయర్ హౌస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ.. చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సామాజిక సంస్థలు ముందుకు రావాలన్నారు. పేదలకు మేలు జరిగే పనిలో తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌రెడ్డి, వెంకటేష్, నాని, మనీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలు ప్రారంభం

కుత్బుల్లాపూర్: మార్షల్స్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఆత్మరక్షణతో పాటు శారీరక ధృడత్వం పెంపొందుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మేడ్చల్ మండలం కండ్లకోయలోని నిమ్మల కన్వెన్షన్‌లో బ్రిలియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్’ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఎమ్మెల్యే ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ నిమ్మల పూజ, కొండపల్లి మణికాంత్, దేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కులస్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు



సదస్సుకు హాజరైన కుత్బుల్లాపూర్‌కు చెందిన బొడ్డు రవిశంకర్

కుత్బుల్లాపూర్: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన అఖిల భారత కుర్మీలు, ఉప కులాల సదస్సుకు కుత్బుల్లాపూర్ నుంచి కమ్మ సంఘం నాయకుడు బొడ్డు రవిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుర్మీల ఉప కులాల్లో కమ్మ సామాజికవర్గం ఒకటని, తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కమ్మ కులస్తులు విస్తరించి ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా, క్రీడాకారులుగా కమ్మ కులస్తులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు కమ్మెట భూపాల్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, బాలాజీ నాయక్, ఆగం రాజు, కోఆప్షన్ సభ్యులు సలీమ్, నాయకులు సతీష్, నిజాంపేట్ కార్పొరేషన్ దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు మేకల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీబస్తీకి ఓబీసీ ఇంటింటికీ బీజేపీ



భగత్‌సింగ్‌నగర్‌లో కరపత్రాలను పంచుతున్న బీజేపీ నాయకులు

చింతల్: బస్తీబస్తీకి ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్, చింతల్ డివిజన్ పరిధిలో భగత్‌సింగ్ నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓబీసీల అభ్యున్నతికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, ఇస్తున్న ప్రాధాన్యతలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, పత్తి రఘుపతి, బానుచందర్, శ్రీనివాస్‌గౌడ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని నిషేధించారు..

అయినా తొలగించరు

ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపుతున్న కోనోకార్పస్ మొక్క



ఐడీపీఎల్ చౌరస్తా నుంచి జగద్గిరిగుట్ట రోడ్డు మార్గంలో ఉన్న కోనోకార్పస్ మొక్కలు

రంగారెడ్డినగర్: ఏపుగా పెరుగుతాయి.. పచ్చదనాన్ని పెంపొందిస్తాయని నాటిన కోనోకార్పస్ మొక్కలు ప్రజల పాలిటి శాపంగా పరిణమిస్తున్నాయి. హరితహారంలో భాగంగా ఈ మొక్కలు జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రధాన రోడ్ల డివైడర్ల మధ్య సర్కిల్ అధికారులు నాటారు. అవి నేడు పర్యావరణంతో పాటు ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపడంతో కోనోకార్పస్ మొక్కలను తెలంగాణ ప్రభుత్వం నిషేధించింది. అయితే కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో మాత్రం రోడ్ల మధ్యలోని డివైడర్ల మధ్య పెంచడం వివాదాస్పదమవుతోంది. ఈ మొక్కల పెంపకంతో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు వాటి నుంచి వెలువడే పుప్పొడితో ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి.

జీహెచ్‌ఎంసీ పరిధిలో నిషేధించినా...

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఐడీపీఎల్ – జగద్గిరిగుట్ట రోడ్డులోని డివైడర్ మధ్య సుమారు 3 కిలోమీటర్ల మేర కోనోకార్పస్ మొక్కలను నాటారు. ఈ చెట్లపై పర్యావరణవేత్తలు ఆందోళన వెల్లుబుచ్చిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో నాటవద్దని అధికారులు నిషేధం విధించినా కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో వాటిని కొనసాగిచడం విమర్శలకు తావిస్తోంది.

దీని పుప్పొడి విషపూరితం..

కోనోకార్పస్ పుప్పొడితో ప్రజలు స్కిన్ అలర్జీ, శాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కనీసం సీతాకోక చిలుకలు వీటి పుప్పొడిపై వాలవు, ఏ శాఖాహార జంతువులు వీటి ఆకులను సైతం తినవవంటే ఇవి ఎంత విషపూరితమైనవో అర్థం చేసుకోవచ్చు.

విదేశాల్లో నిషేధం..

కోనోకార్పస్ చెట్లను రోడ్ల వెంబడి నాటితే డ్రైనేజీ పైపులైన్‌లు, భవనాలు పునాదులు దెబ్బతినే అవకాశముంది. ఇప్పటికే ఈ మొక్కలను విరివిరిగా నాటిన ఖతర్, కువైట్, దుబాయ్, ఇరాన్, సౌత్‌ఆఫ్రికా వంటి దేశాలు ఈ దుష్ప్రభావాలను చవి చూశాయి. దీంతో వీటిని జనవాసాల మధ్య నాటకుండా ఆయా దేశాల్లో పూర్తిగా నిషేధం విధించాయి.

కీటకాలు, పక్షులకు ఉపయోగం లేదు..

ఖతార్‌లో అయితే కూకటి వేళ్లలో ఈ చెట్లను పెకలించారు. ఈ మొక్కతో కీటకాలకు, పక్షులకు ఎలాంటి ఉపయోగం లేదని తేలింది. వీటిపై పక్షులు గూళ్లు కట్టవని, ఏ జంతువూ దీని ఆకులను తినవని పరిశోధనల్లో గుర్తించారు. పర్యావరణ వ్యవస్థలో ఈ మొక్కతో ఎలాంటి ఉపయోగం లేక పోగా అనేక దుష్ప్రభావాలు మాత్రం కలుగజేస్తుందని వృక్ష శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

ఈ చెట్లను తొలగించాలి..

ప్రజా జీవనంపై తీవ్ర ప్రతికూలత చూపే కోనోకార్పస్ మొక్కలను ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు తొలగించి వాటి స్థానంలో పర్యావరణానికి హితం చేసే మొక్కలు నాటాలని పర్యావరణ వేత్తలు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ జలాలపై ప్రభావం..

కోనోకార్పస్ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా వెళ్లడంతో పాటు ఏపుగా ఎత్తుగా పెరుగుతాయి. ఈ క్రమంలో భూమిలోని నీటిని ఎక్కువగా తీసుకోవడంతో ఇతర మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా ఈ మొక్కలు పెరిగే ప్రాంతాల్లో భూగర్భ జలాల అడుగంటి స్థానిక ప్రజలకు నీటి ఇక్కట్లు ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని శాస్త్రీయంగా నిర్వహించిన పరిశోధనల్లో నిరూపితమైంది.

డివైడర్ల మధ్య నీడనిచ్చే చెట్లను నాటుతాం..



జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా కోనోకార్పస్ మొక్కలను నాటడాన్ని నిషేధించారు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలో డివైడర్ల మధ్య ఉన్న కానోకార్పస్ మొక్కలను తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కార్యాచరణ రూపొందించుకుని త్వరలోనే వాటిని తొలగించి నీడనిచ్చే మొక్కలను నాటుతాం. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా జీహెచ్‌ఎంసీ పని చేస్తోంది. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దు.

– మమత, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్

పిజ్జా, బర్గర్ మాను.. చిరుధాన్యాలు తిను



చిరుధాన్యాలపై బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ఫాస్ట్ ఫుడ్‌లకు బదులుగా చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకుంటే అనారోగ్యం దరి చేరదని నిజాంపేట్ నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు అన్నారు. బీజేపీ సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా దివారం బాచుపల్లి కౌసల్య కాలనీలో 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి ‘అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా’ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల్లో లభించే పోషకాలు, వాటితో కలిగే ఆరోగ్య లాభాలపై ప్రజలకు వివరించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ రాజు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లో పిజ్జా, బర్గర్ వంటి అలవాట్లు మానుకుని సేంద్రియ పద్ధతుల్లో పండించిన చిరుధాన్యాలను ఆహారం తీసుకునే అలవాట్లను పెంపొందించుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మాధవరావు, సుధాకర్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, కృష్ణ, సెక్రటరీ ప్రసాద్, సీనియర్ నాయకులు కౌశిక్ నాయుడు, ఉదయ్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి నిరంకుశ పాలన



డీపోచంపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

దుండిగల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు నిరంకుశంగా పాలన కొనసాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీపోచంపల్లి, గండిమైసమ్మ ప్రాంతాల్లో ఆదివారం ఆయన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ... ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ, టెన్త్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైనా ఇంత వరకు సీఎం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు సదానందం, పరశురాంగౌడ్, ఎండీ అక్బర్, రాజిరెడ్డి, భరత్‌గౌడ్, సమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మన్ననలు పొందేలా అధికారుల పనితీరు ఉండాలి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన మగ్దూమ్‌నగర్ వాసులు

రంగారెడ్డినగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందే విధంగా జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరు ఉండాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. సర్కిల్ అధికారులు త్వరలోనే టెండర్లను పిలిచి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు బస్తీ వాసులకు ఆయన వివరించడంతో హర్షం వ్యక్తం చేశారు. బస్తీవాసులు గణేష్ ఝా, జద్వీర్ మిశ్రా, రాకేష్ ఝా, అమిత్ మిశ్రా, బెనిత్ మిశ్రా, మునిందర్, సుమిత్ మిశ్రా తదితరులు ఉన్నారు.

‘కమ్యూనిస్టుల ఏకీకరణతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి’

సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం

కుత్బుల్లాపూర్: కమ్యూనిస్టుల ఏకీకరణతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం అన్నారు. నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన సీపీఐ, సీపీఎం మండల, జిల్లా సమితి సభ్యుల సమావేశానికి ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్‌లు మాట్లాడుతూ... దేశంలో బీజేపీ బలపడిందన్న ప్రచారంలో నిజం లేదని, కేవలం 9 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 160 స్థానాల్లో కేవలం 47 సీట్లను మాత్రమే బీజేపీ దక్కించుకుందన్నారు. గతంలో కంటే ఆ పార్టీకి ఓటింగ్ శాతం తగ్గిందన్నారు. మతం, ప్రాంతం లాంటి అంశాలను ప్రచారం చేస్త బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతోందని ఆరోపించారు. కమ్యూనిస్టులు బలపడితే బూర్జువా పార్టీలకు పుట్టగతులు ఉండవని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సిన వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుతాయన్న భావన ప్రజల్లో ఉందన్నారు. దానిని నిజం చేసేందుకు వామపక్షాల కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. మండల కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, సహాయ కార్యదర్శులు దుర్గయ్య, రాము, కార్యవర్గ సభ్యులు సదానంద్, నర్సయ్య, కృష్ణ, సహదేవ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగి సమావేశానికి తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.



నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలి వెళ్తున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వామపక్షాల నాయకులు

ముస్లింలకు ఇఫ్తార్ విందు



సుభాష్‌నగర్: గాజులరామారంలోని విన్ ప్యాలెస్‌లో ఆదివారం సొంటిరెడ్డి పున్నారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏటా పార్టీలకు అతీతంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు సొంటి రెడ్డి పున్నారెడ్డి పేర్కొన్నారు.



అధికారుల పనితీరు... బూడిదల పోసిన పన్నీరు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి నుంచి గ్రీన్‌హిల్స్ కాలనీకి వెళ్లే దారిలో డ్రైనేజీ సమస్య తలెత్తడంతో రోడ్డును ధ్వంసం చేయడమే నిదర్శంగా చెప్పుకోవచ్చు. బహదూర్‌పల్లి కొంపల్లి ప్రధాన రోడ్డు నుంచి ఉదయగిరి కాలనీ గ్రీన్‌హిల్స్‌కాలనీ మీదుగా సూరారం రాజీవ్‌గృహకల్ప వరకు కిలోమీటర్ మేర ఉన్న రోడ్డు దుస్థితిపై పలుమార్లు సాక్షి వెలుగులోకి తీసుకు వచ్చింది. మూడేళ్ల క్రితం రూ.50 లక్షలతో రోడ్డు వేశారు. రోడ్డు వేసే సమయంలో డ్రైనేజీ మ్యాన్ హోళ్ల ఎత్తు పెంచకుండా పనులు పూర్తి చేశారు. ఇటీవల సమస్య రావడంతో మున్సిపల్ సిబ్బంది మోకాలు లోతు వరకు రోడ్డును తవ్వారు. దీంతో అధికారుల పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కోట్లాది ప్రజాధనం బూడిద బూడిదల పోసిన పన్నీరుగా మారింది.



లేబర్ కమిషనర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తా

టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి



కొలన్ హన్మంత్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు

జీడిమెట్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను మూసేసి కొత్త పరిశ్రమలను తీసుకువచ్చినట్లు డ్రామాలు ఆడుతోందని టీపీసీసీ ప్రెసిడెంట్ మల్కాజిగిరి ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యం గత తొమ్మిదినెలలుగా జీతాలు ఇవ్వకుండా పరిశ్రమ మూసివేసిన విషయం విదితమే. పరిశ్రమ యాజమాన్యం జీతాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెడుతుండటంతో నెల రోజులుగా పరిశ్రమ వద్ద కార్మికులు రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. అయినప్పటికి పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఈ విషయాన్ని పరిశ్రమ ఉద్యోగులు కుత్బుల్లాపూర్ మాజీ ఎంపీపీ కొలన్ హన్మంత్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కొలన్ కార్మికులను టీపీసీసీ ప్రెసిడెంట్ రెవంత్‌రెడ్డిని కలిపించి వారికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

◆ **బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కార్మికులు, రైతులకు వ్యతిరేకులు..**

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి పరిశ్రమ కార్మికులతో మాట్లాడుతూ.. లేబర్ కమిషనర్‌తో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కార్మికుల బాగుకోసం చట్టాలు తెచ్చిందే తప్ప కార్మికులను కష్టాల్లో పారవేయలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కేంద్రంలో బీజేపీలు రెండు పార్టీలు కలిసి కార్మికులు, రైతుల ఉసురు పోసుకుంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో రెండు పార్టీలు గద్దె దిగడం ఖాయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని కార్మికులు, రైతులకు మేలు చేస్తుందని తెలిపారు.

కైసర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



కైసర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు మల్లారెడ్డి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో ఆదివారం డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కోశాధికారి బాలకృష్ణల ఆధ్వర్యంలో ‘చాయ్ పే చర్చ’ పేరుతో స్థానిక సమస్యలపై బీజేపీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యపై ఏఈ సత్యనారాయణతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేయాలని జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పత్తి రఘుపతి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపాల్, శేఖర్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు గురి కాకుండా పరిరక్షించాలి



నిజాంపేట్ సర్వే నం.191లో ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే వందల ఎకరాల ప్రభుత్వ స్థలం హారతి కర్పూరంలా ఆవిరవుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టడం లేదు. తాజాగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి మధురానగర్ కమాన్‌ను ఆనుకుని ఉన్న సర్వే నం.191లోని ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు కబ్జాల పర్వానికి తెర లేపారు. శుక్ర, శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో తమకు అంది వచ్చిన అవకాశంగా మల్చుకుని రాత్రి పగలు తేడా లేకుండా ప్రభుత్వ స్థలంలో మట్టి పోయిస్తూ జేచదును చేస్తున్నారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో గజం స్థలం లక్షల్లో ధర పలుకుతుండటం, ప్రభుత్వ స్థలాల చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలకు టెండర్ పెట్టారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలం కబ్జాకు గురి కాకుండా పరిరక్షించి ప్రజాలకు ఉపయోగపడేలా కార్యాలయాల నిర్మాణాలు, కమ్యూనిటీ భవనాలు, ఆస్పత్రులను నిర్మించాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



షేక్ వాహెబ్ (ఫైల్)



షేక్ ఖుద్దీస్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన రెండు ఘటనలు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన వ్యాపారి షేక్ వాహెబ్ (43) తన అల్లుడు ఇమ్రాన్‌ఖాన్(27), బావమరిది షేక్ ఖుద్దీస్(40)లతో కలిసి నగరంలోని చాంద్రాయణగుట్టకు రంజాన్‌ను పురస్కరించుకుని శనివారం రాత్రి కారు(ఎంహెచ్ 26వీ 4991)లో బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వస్తుండగా ఇన్‌బిస్కో పరిశ్రమకు కొద్ది దూరంలో ఉన్న వేబ్రిడ్జి సమీపంలో ఎటువంటి ఇండికేటర్ వేయకుండా ముందు వెళ్తున్న టిప్పర్ (టీఎస్ 07 యుహెచ్ 0641)ను వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న ఖుద్దీస్, అతని పక్కనే కూర్చున్న వాహెబ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కాగా టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..



సుశ్వాంత్‌నాయక్

◆ మచ్చ బొల్లారానికి చెందిన భ్యాక్యా ధశరథ్ పెద్ద కుమారుడు సుశ్వాంత్‌నాయక్ (22) మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కాగా ఆదివారం తెల్లవారుజాము 2.30 గంటల ప్రాంతంలో ఫంక్షన్‌కు వెళ్లి బైక్(టీఎస్ 19 హెచ్ 0671)పై బహదూర్‌పల్లి రోడ్డు మీదుగా వస్తుండగా వేగంగా వచ్చిన మహీంద్రా వాహనం (టీఎస్ 66 ఏఎఫ్ 1201) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుశ్వాంత్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.